# తొందరపాటు నిర్ణయం

## ఆకుండి నారాయణమూర్తి

ముందుగు వెనుక లాలోచించక అనాలోచిత నిర్ణయం తను చేశాడేమోననే అనుమానం అంతా నిశ్చయమైన అనంతరం కల్గింది అనంతానికి.

ఇక గత్యంతర మేమిటి?

తన అనుమానం నిజమే అయితే...

ఇక చేసేదేమిటి?—

పీటలమీద పెళ్ళిళ్ళు ఎన్నెన్నో తప్పటం తను కళ్ళారా చూసేడు.

దంపతులని ముద్రవేయటానికి 'ప్రధానం' అంత ప్రధానం కాదు!

అందుకయిన ఖర్చు కావాలంటే యిచ్చెయ్యొచ్చు.

కానీ......

మాట తప్పితే తమ వంశగౌరవం ఏమాతుందోననే భయం ఒక ప్రక్కనుంచి బెదిరిస్తోందతన్ని

ఇంతకీ......

ఆ అమ్మాయి ఆకారం తనకు బాగా నచ్చింది.

ఆ వనితవదనం చాలా ఆకర్షణీయమైనది.

ఆమె చూపు మామూలు చూపుకాదు.

ఎదుటివాళ్లను మైమఱపించే మధురమైన చూపది.

ఆమె సోయగానికి పరవశుడై ఏదో తెలియని మైకంలోపడి తల్లి దండ్రులకు తన సమ్మతిని తెలియజేశాడానాడు అనంతం.

ఇక నేం!

'శుభస్యశీఘ్రం' అన్నారు పెద్దలు.

వెన్వెంటనే తాంబూలాలను స్వీకరించడం జరిగింది.

వివాహమంటే?

ఒక జీవితకాలంపాటు జంటగా హృదయాలు ఒకదానిలో ఒకటి ఐక్యమై బాధ్యతల బరువును మోస్తూ చేసే ప్రయాణం.

అటువంటి సుదీర్ఘమయిన ప్రయాణంలో తన మనస్సులో ఆమె మనస్సును మిళితం చేసి, కొసవఱకూ తనతో సవ్యంగా పయనించే తత్వంగల మనిషి కాదేమో ఆమె అనే అనుమానం పీడిస్తోందతన్ని.

ఈనాడు తనకు కల్గిన అనుమానం, ఆనాడు-అంటే ఆ అమ్మాయిని చూసిన నాడు కల్గలేదు.

పిల్లని చూడడానికి రమ్మని కోరేడామె తండ్రి.

తనూ తల్లి దండ్రులూ వెళ్ళిచూశారు.

మధ్యాహ్నం ఒంటిగంటకెళ్ళి, సాయంత్రం ఐగుగంటలకు అంతా నిశ్చయించుకొని వచ్చెయడం జరిగింది. ఒకటి రెండురోజులపాటు వాళ్ళింట్లోవుండి ఆ అమ్మాయి నడతను పరిశీలించవలసింది. కానీ 'కలికితే అతక'దనే మూఢనమ్మకంతో అలా వీలుపడలేదు. ఇంతకీ ఆ నాడు ఆ సమయంలో ఆ అమ్మాయినిగుఱించి వెనకా ముందూ ఇంతగా ఆలోచించలేదు తాను.

ఇప్పుడెంత విచారించినా ఏంలాభ మనుకున్నాడు అనంతం.

తొందరపాటు నిర్ణయం జరిగిపోయింది.

లోలోన వేధిస్తున్న అనుమానపుభారంతో ఆ అమ్మాయిని వివాహం చేసుకుంటే— జీవితరథం ఏ ఒడిదుడుకులూ లేకుండా సాఫీగా సాగిపోదేమోనని అతని భయం.

ఆ అమ్మాయిని చూడ్డానికెళ్ళిననాడే ఆ షోకిలా కాలేజీ కుఱ్ఱాడు తనకాఇంట్లో అగుపిస్తే కథ యింతవరకూ పెరిగేది కాదనుకున్నాడు అనంతం.

సరదాగా ఓ జల్సాట్రిప్పు తిరిగి రావాలనే సంకల్పంతో అవాళ విజయనగరం వెళ్ళేడు అనంతం. లీలామహల్‌లో అవాళ మంచి సినిమా ఏదీ లేదు. ఏదో చెత్త పిక్చరుంది. అది చూడాలనే సంకల్పం అల్పంగానైనా లేదతనికి. కానీ ఆ హాలుకు పోయేదారిలో మునిసిపల్ హైస్కూలు టర్నింగులో తన కాబోయే మామగారి ఇల్లుంది. అదృష్టం బాగుండీ ఆ అమ్మాయి అగుమ్మంలో ఆ వేళకుంటే, మరోమారు ఆ లావణ్యవతిని చూసే భాగ్యం తనకు లభిస్తుందనే సగుద్దేశ్యంతో ఆ హాలుకు బయలుదేరి డావీధిలోంచి.

కానీ తానూహించిన ప్రకారం జరగలేదు.

ఆ అమ్మాయి ఆ గుమ్మంలో అగుపించలేదు.

కానీ, టిప్‌టాప్‌గానున్న ఓ యువకుడు ఆ ఇంటి వీధికొట్టుకు తాళంవేసి, ఇంటిలోకి వెళుతూండడం చూశాడు అనంతం.

ఆ యువకుడు ఓ కాలేజి స్టూడెంటయుంటాడనీ, ఆ వీధి కొట్టులో అద్దెకుంటున్నాడనీ ఊహించడాని కతను సంకోచించలేదు. ఆ అమ్మాయికి ఇద్దరు తమ్ముళ్లున్నారుగానీ అన్నయ్యలు లేరు. అంచేత వాడెవడో పరాయివాడేనని నిశ్చయించుకున్నాడు.

ఎలాగో కాళ్ళీడ్చుకుంటూ హాలుకెళ్ళేడు

---

**అంతామిథ్య**

ఒహా పెద్దమనిషి కుండీలో వున్న మొక్కకి నీళ్ళోస్తూంటే మరొహా పెద్దమనిషి చూసి—

"అదేవిటండీ ఆ బకెట్టుతో పోస్తున్నారు. దానికి కిందేమీ వున్నట్టు లేదే" అన్నాడు.

"మరేం పరవాలేదులెండి— ఇవి కాగితం పువ్వులేగా!"

---

# ★ తొందరపాటు నిర్ణయం ★

అతని మనస్సు వికృతంగా తయారయింది.

పెనవ కక్కుర్తి.

డబ్బుకక్కుర్తి.

వాళ్ళను కప్పెట్టేటంత డబ్బుంది.

అయినా ఏమిటీ సంకటం.?

ఆ వీధికొట్టు అద్దెకివ్వకపోతే గడవదా ఏమిటి?

పోనీ ఇచ్చి ఇచ్చి కాలేజీ స్టూడెంటుకే ఇవ్వాలా?

ఇది కలియుగం.

ఎవ్వరినీ నమ్మడానికి వీల్లేదు.

అవినీతి పనులలో ఆనందం ఎక్కువగా ఉండటం సహజం!.

అంతా అనుకూలంగా ఉండి విషయం గోప్యంగా ఉంటుందనే నమ్మకముంటే, అవినీతి పనులు చెయ్యడానికి చాలామంది వెనకంజ వెయ్యరు అని అనంతం ఉద్దేశ్యం.

ఇంట్లోపల అందమైనయువతి! గుమ్మంలో అందమైన యువకుడు! దుర్బుద్ధి ఎవరికైనా పుట్టవచ్చు!

మగా ఆడా అనే విచక్షణ లేకుండా కలిసి మెలిసి తిరగడం నవీన నాగరికతగల వాళ్ళ లక్షణమట. కానీ, పాడుబుద్ధి మనిషి కెప్పుడో ఓ ముహూర్తంలో పుడుతుంది. శారీరకోద్రేకా లటువంటివి. ఆక్షణంలో విచక్షణ జ్ఞానం నశిస్తుంది. అంచేత......

ఆ అమ్మాయి తప్పటడుగు వేసేటందుకు అనుకూల వాతావరణం ఆ ఇంట్లో లేక పోలేదని అతని భావం.

తను బి. ఏ. చదువుతున్న రోజుల్లో ఓ అమ్మాయి ఆమె శీలాన్ని చెడగొట్టుకొని అటుపైని కొన్నాళ్ళతరువాత వేరే ఇంకొకణ్ణి పెళ్ళిచేసుకొని, ఓ పతివ్రతగానే ఈ లోకంలో ఈనాటివరకూ చెలామణీ అవుతున్నాది. పెద్ద పెద్ద పట్టణాలలో తాము మంచి నాగరికత కలవాళ్ళమని చెప్పకొనే ఈ రకమైన సతీమణులు ఎంతమందో ఏమిటో? ఇంతకీ తనకాబోయే మామగారి గుమ్మంలో ఆనాడగుపించిన ఆ యువకుడి పోజూ, ఆ వ్యవహారం చూస్తే చదువుమీద శ్రద్ధగల వాడిలా అగుపించలేదు. అమ్మాయిల అనురాగం కోసం బ్రతికే జీవిలా అగుపించేడు.

వాడికళ్ళు మంచివికావు. ఏదో తీక్షణమైన ఆకర్షణ ఆకళ్ళలో ఉంది. ఖచ్చితమైన పోకిరీ లాగున్నాడు.

ఇంతకీ.........

వాడెలాంటి వాడైతేనేం? ఆ అమ్మాయి మంచిదేనని ఎందుకనుకో కూడదు.

ఒకవేళ ఆ అమ్మాయి ఆ యువకుణ్ణి ప్రేమించి ఉంటుందా? ఆమె అతణ్ణి ప్రేమించుంటే మరి ఈ వివాహ ప్రసక్తి ఎందుకొచ్చింది? తనను వివాహం చేసుకోనే టందు కామె ఎందుకొప్పకుంది?

వాడు ఏ కులమో ఏమిటో? పెద్దలు ఇష్టపడలేదు కాబోలు! ఈ విషయంలో పెద్దలు అయిష్టత చూపి ఉన్నట్లయితే, ఈ పాటికి ఆ యువకుణ్ణి ఆ లాడ్జీలోంచి సాగనపుండే వారు అలా జరగలేదు గనుక వారి ప్రేమ పెద్దల దృష్టిలో పడలేదన్న మాట.

వివాహ ముహూర్తపురోజు సమీపిస్తున్నది. ఈలోగా ఏదో ఒకటి తేల్చేసుకోవాలనుకున్నాడు అనంతం.

తనకి సంబంధం ఇష్టంలేదని ఆపిల్ల తండ్రికి రాసేస్తే? అలా వ్రాసేటప్పుడు ఏదో ఓ కారణం వ్రాయాలికదా? ఏమని వ్రాయడం యథార్థం వ్రాయడం చాలా అసందర్భమైన విషయం. ఇంతకీ అతనికీ విషయం వ్రాసే ముందు తన తల్లిదండ్రులకీ విషయం చెప్పొద్దూ? మాటిచ్చిన తరువాత అలా జరిగి తీరాలనే తత్వం తన తండ్రిది. తన అనుమానాన్ని తండ్రికి తెలియజేసినా చిక్కే. డప్పుపట్టుకొని మరీ చాటుతాడు వాళ్ళ గురించి. ఇంతకీ ఖచ్చితమైన ఆధారాలేమీ లేకుండా తన అనుమానాన్ని బహిర్గతం చెయ్యడం చాలా తెలివితక్కువపని. ఒకవేళ తన అనుమానం అసందర్భమైనదయితే నిష్కారణంగా ఆవనితజీవితం నాశనమవుతుంది. అందుచేత మరేదయినా ఎవ్వరికీ హాని కల్గించని సమంజసమైనకారణాన్ని కల్పించి ఈ వివాహం కేన్సిల్ చేయించాలి.

ఎలా?

ఎంతాలోచించినా మార్గమగుపించలేదు. ప్రధానం కూడా అయిపోయిన తరువాత-తనకాపిల్లను పెళ్ళిచేసుకోడంఇష్టంలేదంటే-కారణమేమిటని పెద్దలంతా తప్పక అడిగి తీరుతారు.

ఇక పదిహేనుదినాలలోనే వివాహ ముహూర్తం. ఏం చెయ్యడం?

రెండుదినాలపాటు సుదీర్ఘంగా ఆలోచించేడు అనంతం.

ఓ గమ్మత్తయిన ఆలోచన తట్టింది అనంతానికి.

ఆ అమ్మాయి పేరను ఓ ఆకాశరామన్న లేఖ వ్రాశాడు "మీరు వివాహం చేసుకోబోతున్న వ్యక్తి ప్రవర్తన మంచిదికాదు. అతను దుశ్శీలుడు. ఇప్పటికైనా మించిపోయిందేమీలేదు. మీ నిర్ణయాన్ని మార్చుకోండి" అని.

* * *

అవాళ అనంతం అనుమానం తీరింది. ఆ వీధి కొట్టులో ఉన్న ఆయువకుడు ఆ అమ్మాయి పెదనాన్న కొడుకని. కాలేజిలో చదువుకుంటున్నాడనీ తెలిసింది. తను ఆ అమ్మాయిని చూడడాని కెళ్ళిననాడు, అతను ఊళ్లోలేడు. అంచేత ఆనాడు అతనిని చూపడం తటస్థించలేదు. అనవసరంగా అనుమానించడు. అనంతానికి నిజం తెలిసేసరికి చాలా ఆలస్యమైంది. ఆ అమ్మాయికి వేరే మరొకనితో వివాహమైపోయినతరువాత అతని కావిషయం తెలిసింది.

అనంతం వ్రాసిన ఆకాశరామన్న ఉత్తరం బాగానే పనిచేసింది.

తమ పిల్ల జాతకానికీ, కుఱ్ఱాడి జాతకానికీ పొత్తు కుదరలేదనేసాకుతో నిర్ణయం రద్దు చేయించే డాపిల్ల తండ్రి.

చాలా కాలమయి అనంతానికి పిల్లనిచ్చేటందుకు ఎవ్వరూ ముందుకు రాలేదు. అందుకు కారణం అతని తల్లిదండ్రుల కేమీ తెలియ దింతవరకూ. తనకు పిల్లనిచ్చేటందు కెవ్వరూ ఎంచేత సాహసించలేక పోతున్నారో అనంతానికి తెలుసు. ★

